సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



హోరాహోరీగా ఎస్‌పీఎల్

సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ క్రికెట్ మ్యాచ్‌లు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. - 8లో



ప్రభుత్వ స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట

రాజంపేటలో కోట్ల రూపాయలు విలువ చేసే స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు అడ్డుకట్ట వేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 182 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	685	690
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 223.46 కిలోలు



పచ్చని బతుకులు

కులాలు చూడం.. మతాలు చూడం.. ప్రాంతాలు చూడం.. వర్గాలు చూడం.. చివరకు రాజకీయాలు చూడం.. పార్టీలు కూడా చూడకుండా ప్రతి ఒక్కరికీ మంచి చేసే ప్రభుత్వం మనది అని చెప్పడానికి గర్వపడుతున్నా.. ఇవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి బహిరంగ సభలోనూ చెప్పే మాటలు.. అవును.. ఈ మాటలు అక్షర సత్యాలని నిరూపిస్తున్నాయి రాష్ట్రంలోని పరిస్థితులు.. ఉమ్మడి వైఎస్సార్ జిల్లానే తీసుకుంటే ఇక్కడి ప్రతి నియోజకవర్గంలోనూ తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. అమ్మఒడి మొదలుకుని రైతు భరోసా వరకు.. అనేక సంక్షేమ ఫలాలను వారు అనుభవిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి.

- వైఎస్ జగన్ సర్కార్‌లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- కులాలు లేవు.. మతాల్లేవ్.. రాజకీయాల్లేవ్...అర్హతే ప్రామాణికం
- బద్వేల్ టీడీపీ కౌన్సిలర్ కుటుంబానికి రూ.11.6 లక్షలు లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బహిర్గతమవుతున్న వైనం
- నాడు జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులకే పింఛన్లు
- జిల్లా వ్యాప్తంగా మూడేళ్లలో అర్హులకు రూ.5,997.74 కోట్లు పంపిణీ

సాక్షి ప్రతినిధి, కడప: ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన రోజున వర్గాలను చూడం, పార్టీలను చూడం, రాజకీయాలకతీతంగా ప్రభుత్వ ఫలాలు అందిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అర్హుల ఇంటికి చేరుతున్నాయి. తర, తమ, భేదం లేకుండా ఆయా పథకాలకు అర్హులైతే గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సు ఉన్నోళ్లకే ప్రభుత్వ పథకాలు అందేవి. నాటి పరిస్థితులను ప్రస్తుతం పూర్తిగా తిరగరాశారు. అందుకు తార్కాణమే టీడీపీ నేతల కుటుంబానికి చేకూరిన లబ్ధి. జిల్లా వ్యాప్తంగా టీడీపీ క్రియాశీలక నేతలందరికీ వైఎస్ జగన్ సర్కార్ సంక్షేమ ఫలాలు దక్కాయి. సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న నేతల వరకూ అర్హుల జాబితాలో ఉండడం విశేషం.

జిల్లా వ్యాప్తంగా రూ.5,997.74 కోట్లు లబ్ధి

గడిచిన మూడేళ్లలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.5,997.74 కోట్లు నేరుగా లబ్ధి చేకూర్చింది. అందులో వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా వివిధ ఫించన్లు 2,49,868 మంది లబ్ధిదారులకు రూ.2,287.58 కోట్లు దక్కింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 2,22,041 మందికి వివిధ చికిత్సల నిమిత్తం రూ.478.17 కోట్లు వెచ్చించారు. అలాగే వైఎస్సార్ రైతు భరోసా ద్వారా నాలుగు విడతలుగా జిల్లాలోని రైతుల ఖాతాలకు రూ.1,022.06 కోట్లు జమ చేశారు. వైఎస్సార్ చేయూత ద్వారా అక్కచెల్లెమ్మలకు రూరల్‌లో రూ.467.85 కోట్లు, అర్బన్‌లో రూ.149.59 కోట్లు దక్కింది. జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రూ.244.06 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలకు చేరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అర్హతే ఏకైక ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తోంది.



టీడీపీ సర్పంచ్‌కు అక్షరాలా రూ.2,13,256 లు లబ్ధి



టీడీపీ సర్పంచ్ ప్రభావతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు(ఫైల్)

రాజుపాళెం మండలం అర్కటవేముల గ్రామ పంచాయతీ టీడీపీ సర్పంచ్ ఎత్తపు ప్రభావతి కుటుంబానికి గత మూడేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,13,256 లబ్ధి చేకూరింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు సర్పంచ్ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు.

సర్పంచ్ కుటుంబానికి చేకూరిన లబ్ధి

ఇన్‌పుట్ సబ్సిడీ	- రూ.46,215
వైఎస్సార్ పెన్షన్ కానుక	- రూ.65,000
వైఎస్సార్ సున్నా వడ్డీ	- రూ.3,210
వైఎస్సార్ ఆసారా	- రూ.23,442
వైఎస్సార్ సున్నా వడ్డీ	- రూ.7,913
వైఎస్సార్ రైతు భరోసా	- రూ.67,500

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన నగదు వివరాలు..

సంవత్సరం	లబ్ధిదారులు	అందజేసిన మొత్తం (రూ.కోట్లలో)
రైతు భరోసా		
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	198074	192.96
మొత్తం	8,12,873	1,022.06
సున్నా వడ్డీ పంట రుణాలు		
	185303	39.14
జగనన్న అమ్మ ఒడి		
	187742	244.06
జగనన్న విద్యా కానుక		
2020-21	177318	27.13
2021-22	183364	30.61
2023-23	181001	36.20
మొత్తం	5,41,683	93.94
జగనన్న వసతి దీవెన		
	50575	46.04
జగనన్న విద్యా దీవెన		
మొదటి విడత	51902	29.61
రెండవ విడత	51798	34.52
మూడవ విడత	52491	34.08
నాల్గవ విడత	52261	33.85
మొత్తం	2,08,452	131.96
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ		
2019-20	35394	90.97
2020-21	43512	102.10
2021-22	73064	147.03
2022-23	70071	138.07
మొత్తం	2,22,041	478.17
వైఎస్సార్ పెన్షన్ కానుక		
	249868	2287.58
జగనన్న తోడు		
మొదటి విడత	17446	17.41
రెండవ విడత	17264	17.26
మూడవ విడత	16659	16,65
నాల్గవ విడత	9202	9.20
ఐదవ విడత	19620	31.73
మొత్తం	80,191	92.25
జగనన్న చేదోడు		
మొదటి విడత	14007	14.00
రెండవ విడత	14046	14.04
మొత్తం	55,053	28.04

టీడీపీ కౌన్సిలర్ కుటుంబానికి...

సోమేశుల సుధామణి బద్వేల్ మున్సిపాలిటీలో 6వవార్డు టీడీపీ కౌన్సిలర్. తెలుగుదేశం పార్టీకి చెందిన ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మూడేళ్లలో రూ.11,60,440 నగదు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ఉమ్మడి కుటుంబం కావడంతో తోడికోడలు సోమేశుల సుభాషిణికి రూ.9,04,924, స్వతహాగా కౌన్సిలర్ సుధామణికి రూ.78,994, కోడలు సోమేశుల సావిత్రికి రూ.1,50,598, మరో తోడికోడలు సోమేశుల సుబ్బరత్నమ్మకు రూ.25,924 లబ్ధి చేకూరింది. కౌన్సిలర్ కుటుంబానికి లభించిన సంక్షేమ పథకాల వివరాలను తాజాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. సుధా కుటుంబ సభ్యులకు అందించారు.

టీడీపీ కార్యకర్తకు రూ. 6.98,783 లబ్ధి

కురబలకోట మండలం ఎర్రబల్లె సచివాలయ పరిధిలోని సింగన్నగారిపల్లెకు చెందిన గంగరాజు తొలి నుంచి టీడీపీ కార్యకర్త. చంద్రబాబు అంటే పిచ్చి. ఇతని భార్య అడ్డగింటి రమణమ్మ పేరుతో వీరి కుటుంబానికి ఈ మూడున్నరేళ్లలో వివిధ పథకాల కింద రూ. 6.98 లక్షల మేర లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఫింఛన్ కానుక, రైతు భరోసా, పంటల బీమా, సున్నా వడ్డీ, పక్కా ఇళ్ల వచ్చాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గ్రామ పర్యటనలో భాగంగా వారింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. లబ్ధిదారు కళ్లల్లో ఆనందం కన్పించింది. 13 ఏళ్లకు పైగా సీఎంగా ఉన్నప్పటికీ చంద్రబాబు కూడా ఇన్ని పథకాలు ఇవ్వలేదని చెబుతున్నారు. అంతేకాదు జీవితంలో ఎన్నడూ లేని విధంగా జగన్ పాలనలో ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మంచి చేసే వాళ్లకు ప్రజల ఆశీస్సులు లభిస్తాయని ఇతను చెబుతున్నాడు.



గంగరాజు కుటుంబానికి అందిన పథకాలు

టీడీపీ ఇన్‌చార్జి కుటుంబానికి లబ్ధి

ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని మంజూరు చేసింది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆయన కుటుంబం వరుసగా రైతు భరోసా ద్వారా లబ్ధి పొందుతోంది. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తండ్రి గండ్లూరి ప్రతాప్‌రెడ్డికి కమలాపురం మండలం కోగటం గ్రామ పరిధిలో పంట పొలాలు ఉన్నాయి. టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి సతీమణి మౌనికా రెడ్డి, సోదరులు వీరప్రదీప్‌కుమార్‌రెడ్డి, వీరారెడ్డి, తండ్రి గండ్లూరి ప్రతాప్‌రెడ్డి, తల్లి పద్మావతమ్మలకు 2021లో కమలాపురం మండలంలో సబ్సిడీ శనగలు మంజూరయ్యాయి.



రైతు భరోసా మంజూరైన పత్రం

న్యూస్‌రీల్

నేడు రైతు బజారు ప్రారంభం



రైతు బజారును శుభ్రం చేయిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలో శుక్రవారం రైతు బజారు ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన ఈమేరకు ఏర్పాట్లు పరిశీలించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే చిరువ్యాపారులకు ఇదొక మంచి అవకాశమన్నారు. రైతులు తాము పండించిన కూరగాయలు, పండ్లు, కాయలు, ఆకు కూరలు ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముకొనే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఎన్‌ఎంఎంఎస్ హాల్ టిక్కెట్

రాయచోటిటౌన్ : ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని డీఈఓ రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇప్పటికీ హాల్ టిక్కెట్లు పొందని విద్యార్థులు ప్రభుత్వ పరీక్షల కార్యాలయం వెబ్ సైట్ స్కూల్ లాగిన్‌ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి

రాయచోటి : భూముల రీసర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. చీఫ్ సెక్రటరీ డా.జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఫైనల్ ఆర్‌ఓఆర్ తదితర కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. కాగా యువతకు స్వయం ఉపాధి కోసం ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ ఔట్‌లెట్లను ప్రతి మండలంలో ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

విదేశీ విద్యాదీవెన లబ్ధిదారులపై దృష్టి పెట్టండి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన లబ్ధిదారులపై దృష్టి సారించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు.లీ పథకానికి 3వ తేదీ నిధులు విడుదల చేస్తున్నందున ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యేటట్లు చూడాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- మార్చి 30న అంకురార్పణ, 31న ధ్వజారోహణం
- అధికారులతో జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష

ఒంటిమిట్ట : ఏకశిలా నగరి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల తన చాంబర్‌లో గురువారం సాయంత్రం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోదండరామస్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీని ఎప్పుడు ప్రారంభించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. స్వామి వారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, వారికి అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎండా వేడిమి నుంచి ఉపశమనం కలిగించడానికి విరివిగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయడానికి అవసరమైన కౌంటర్లు సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని పారిశుధ్య ఏర్పాట్లు చేయాలన్నారు. మార్చి 30వ తేదీ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని, 31వ తేదీ ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ ఈఓలు గుణభూషణరెడ్డి, గోవిందరాజన్, సుబ్రమణ్యం, శ్వేత, డైరెక్టర్ ప్రశాంతి, అన్నదానం ప్రత్యేక అధికారి జీఎల్ఎస్ శాస్త్రి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్, డీఎఫ్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గతంలో టమాటాల స్టాకుతో కళకళలాడుతున్న మండీలు(ఫైల్)



- టమాటాల స్టాకు లేక వెలవెలబోతున్న మండీలు
- వర్షాభావం, రోగాలతో తగ్గిన టమాటా సాగు
- మూతపడ్డ మండీలు
- మార్కెట్లో కిలో టమాటా రూ.22

నేడు టమాటాల స్టాకులేక వెలవెలబోతున్న మండీలు



ధరలు ఘనం.. దిగుబడి శూన్యం

గుర్రంకొండ: ధరలు ఘనం దిగుబడి శూన్యంగా మారింది టామాటా రైతుల పరిస్థితి. మొన్నటివరకు దిగుబడి ఎక్కువగా ఉండగా ధరలు బాగున్నాయి. టమాటా ధరలు ఘనంగా ఉన్నా వర్షాభావంతో పాటు పలురకాల రోగాల బారిన పడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయి మార్కెట్లో టమాటాల స్టాకు లేక వెలవెలబోతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 1500 ఎకరాల్లో మాత్రమే టమాటా పంట దిగుబడి వస్తోంది. ఈ ఏడాది గత నెలవరకు మార్కెట్ యార్డులో స్టాకు ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం మార్కెట్లో ధరలు పుంజుకొన్నా దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. మార్కెట్లో కిలో టమాటా ధరలు రూ.22 వరకు పలుకుతున్నాయి.

23650 ఎకరాల నుంచి 1500 ఎకరాలకు పడిపోయిన దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రతి ఏడాది ఈ సీజన్‌లో 23650 ఎకరాల్లో టమాటా పంటను సాగు చేసేవారు. గతంలో వరుసగా కురిసిన వర్షాలతో టమాటా తోటలు రోగాల బారిన పడి బాగా దెబ్బతిన్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా టమాటా పంట దిగుబడి ఈ నెలలో అత్యల్పంగా వస్తోంది. గత ఏడాది ఇదే సీజన్‌లో అత్యధికంగా 24 వేల ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఈ సీజన్‌లో అత్యల్పంగా కేవలం 1500 ఎకరాల్లోనే టమాటా పంట దిగుబడి వస్తుండడం గమనార్హం. దీంతో మార్కెట్లలో టమాటాల స్టాకు లేక మండీలు వెలవెల బోతున్నాయి.

గత వారం రోజులుగా జిల్లాలోని మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు..

తేది	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25కేజీలక్రీట్)
జనవరి 27	35	రూ.410
28	37	రూ.425
29	42	రూ.465
30	38	రూ.478
31	47	రూ.500
ఫిబ్రవరి 01	52	రూ.525
02	56	రూ.560

నిలకడగా ధరలు

గత పదిహేను రోజులుగా టమాటా ధరలు నిలకడగా ఉన్నాయి. 25 రోజులు క్రితం 25 కేజీల టమాటా క్రీట్ ధరలు అత్యధికంగా రూ.300 లోపే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రీట్ ధర రూ. 500 నుంచి రూ.550 వరకు పలుకుతున్నాయి. గత కొన్ని రోజులుగా మార్కెట్లో టమాటా ధలు హెచ్చు తగ్గులు లేకుండా ఇవే ధరలు నిలకడగా ఉండడంతో రైతులు ఊపిరి పీల్చుకొంటున్నారు.

వర్షాలతో దెబ్బతిన్న తోటలు

గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో అలాగే ఈ ఏడాది జనవరిలో కురిసిన వర్షాలకు జిల్లాలో టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. అప్పట్లో టమాటా ధరలు ఘనంగా ఉన్నా వర్షాల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కాయలపై నల్లమచ్చలు, కాయలు వైరస్ బారిన పడడం వంటి లక్షణాలతో కాయలు దెబ్బతిన్నాయి. తోటలకు అగ్గితెగులు వంటి రోగాలు సోకి చెట్టు నల్లరంగులో మారిపోయి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతులు నష్టపోయారు.

మూతపడ్డ మండీలు

టమాటాల స్టాకు లేక మార్కెట్‌యార్డులోని టమాటా మండీలు చాలావరకు మూతపడ్డాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో మొత్తం 527 మండీలు ఉన్నాయి. గత నెలవరకు 429 మండీలను నిర్వహించేవారు. ప్రస్తుతం కేవలం 214 మండీలు మాత్రమే నిర్వహిస్తున్నారు. మిగిలిన మండీలన్నీ మూతపడ్డాయి. పంట దిగుబడి లేక.. స్టాకు రాక పోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

నిలిచిపోయిన ఎగుమతులు



జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల పరిధిలోని మండీల నుంచి గత నెల వరకు ప్రతిరోజు 65 నుంచి 85 లారీల టమాటాలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. రాష్ట్రంలోని నరసరావుపేట, మార్కాపురం, గుంటూరు, బద్వేలు, ప్రొద్దుటూరుతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఇక్కడి టమాటాలు ఎగుమతి అయ్యేవి. వీటితోపాటు ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కలకత్తా, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి టమాటాలను తరలించేవారు. అయితే నేడు 15 వాహనాల్లో మాత్రమే టమాటాలు బయట ప్రాంతాలకు వెళుతున్నాయి. స్టాకు పూర్తిగా తగ్గిపోవడంతో బయట రాష్ట్రాలకు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.

దిగుబడి తగ్గిపోయింది



యార్డులోని టమాటా మండీలకు టమాటాల స్టాకు రావడం లేదు. టమాటా దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. గత ఏడాది రెండు నెలల పాటు కురిసిన వర్షాలకు టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. వైరస్ ఇతర రోగాల బారిన టమటా తోటలు పడడంతో చాలా వరకు పంట దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం టామాటా ధరలు నిలకడగా ఉన్నాయి. అయితే అందుకు తగినంతగా స్టాకు లేకపోవడంతో వ్యాపారం బాగా దెబ్బతింది. - జగదీష్, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ

నిబంధనల పాటింపుతోనే ప్రమాదాల నివారణ

రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపులో డీఎస్పీ, ఆర్టీసీ డీటీపీవో



ఆర్టీసీ కార్మికులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

రాయచోటి అర్బన్: రోడ్డుభద్రతకు సంబంధించిన నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని రాయచోటి డీఎస్పీ శ్రీధర్, అన్నమయ్య ఆర్టీసీ రవాణాధికారి జగదీష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డిపో ఆవరణంలో నిర్వహించిన రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా బస్సులను నడపడం ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చవచ్చన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. గ్యారేజ్ సిబ్బంది క్రమశిక్షణతో మెలుగుతూ బస్సులను సరైన కండీషన్‌లో ఉంచడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు బస్సులు నడిపే సమయంలో ఎంతో ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎన్‌ఫోర్స్ మెంట్ స్క్వాడ్ అధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు బస్సులను రోడ్డుమీద కాకుండా పక్కన ఆపాలని సూచించారు. ఘాట్‌రోడ్డులోనూ, మలుపుల వద్ద వాహనం నడిపేటప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవీసీఎంఈ ఇబ్రహీం, రాయచోటి డీఎం ధనుంజయతో పాటు పీలేరు ,మదనపల్లె-1,2 రాజంపేట డిపోల మేనేజర్‌లు, అన్నివిభాగాల సూపర్‌వైజర్‌లు, డ్రైవర్లు,గ్యారేజి కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో గురువారం జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన భార్యాభర్తలు శంకరరావు(50), శ్యామలాభాయి(40) ద్విచక్ర వాహనంలో నీరుగట్టువారిపల్లె బైపాస్‌రోడ్డులో వస్తుండగా మునెప్పకాలనీకి చెందిన కృష్ణమూర్తి కుమారుడు రామకృష్ణ(50) బైక్‌లో వస్తూ అదుపుతప్పి ముందువెళుతున్న దంపతుల స్కూటీని ఢీకొన్నాడు. ప్రమాదంలో రెండువాహనాల్లోని ముగ్గురు గాయపడ్డారు. బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి..

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన కురబలకోట మండలం చేనేతనగర్ సమీపంలో జరిగింది. మదనపల్లెకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు అంగళ్లు సమీపంలోని మిట్స్ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు రాసి ఆటోలో తిరిగి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్‌కు చెందిన పవన్‌ఆదిత్య తీవ్రంగా గాయపడ్డాడు. మరికొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను ఆటోలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్సలు అందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రాజంపేట : కడప రిమ్స్‌లో గురువారం చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి (50) మృతి చెందినట్లు పట్టణపోలీసులు తెలిపారు. గత నెల 23న తిరుపతి బైపాస్‌రోడ్డులోని తిరుమల వే బ్రిడ్జి ఎదురుగా రోడ్డు పక్కన మద్యంమత్తులో పడిపోయాడు. స్థానికులు 108లో రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భువనగిరిపల్లె వీఆర్‌ఏ కంభయ్యగారి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు రాజంపేట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. గురువారం కడపలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బడ్జెట్ బాగాలేదని పేపర్ స్టేట్‌మెంట్లకు పరిమితం కాకుండా కేంద్రంపై పోరాడాలన్నారు. పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి ఏమి సాధించాలని రాజకీయాల్లోకి వచ్చాడో తెలియడం లేదన్నారు. అనంతరం చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, జిల్లా కో–ఆర్డినేటర్ హరి ప్రసాద్, నాయకులు ప్రభాకర్, నజీర్ అహ్మద్, బండి జకరయ్య, జోడు నాగరాజు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్

- సెమీఫైనల్‌కు చేరిన జట్లు
- నేడు ఫైనల్ మ్యాచ్‌లు

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP


కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో తలపడుతున్న ఎస్.కె.ఎస్.సి. నిర్మల కళాశాల జట్లు

కడప స్పోర్ట్స్ : సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ క్రికెట్ మ్యాచ్‌లు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. బ్యాట్స్‌మెన్ సిక్సర్‌లు, ఫోర్లతో చెలరేగగా, ప్రత్యర్థి జట్టను కట్టడి చేయడంలో బౌలర్లు విజృంభించారు. మ్యాచ్‌లు ఆద్యంతం ఉత్కంఠగా సాగగా.. విజేతలుగా నిలిచిన జట్లు కేరింతలతో సందడి చేశారు.


51 పరుగులు చేసిన ఎస్.వి. డిగ్రీ కళాశాల బ్యాట్స్‌మన్ జయరాం


3 వికెట్లు తీసిన ఎస్.కె.ఎస్.సి. బౌలర్ శివకేశవ

రాణించిన 'రాచపూడి'

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో బద్వేలు, శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పాలకొండ్రాయ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది.తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాచపూడి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. జట్టులోని మహమ్మద్ వరీష్ 23 పరుగులు చేశాడు. పాలకొండ్రాయ బౌలర్ మనోజ్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాలకొండ్రాయ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. జట్టులోని అబ్బాస్ 33 పరుగులు చేశాడు. రాచపూడి బౌలర్ మహమ్మద్ వరీష్ 4 వికెట్లు తీశాడు. దీంతో రాచపూడి జట్టు 10 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు విజయం

కేఓఆర్‌ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గ్లోబల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. జట్టులోని అశోక్‌కుమార్ 30 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌డ్రా అయింది. సూపర్ ఓవర్ ద్వారా ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

నేటి మ్యాచ్‌ల వివరాలు..

- సెమీఫైనల్–1 : కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు – శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, బద్వేలు.
- సెమీఫైనల్–2: కేఓఆర్‌ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల, కడప – ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప
- కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు
- కేఓఆర్‌ఎం మైదానంలో జూనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఎస్.ఆర్.ఐ.టి, ప్రొద్దుటూరు– ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ.


బ్యాట్స్‌మెన్ క్లీన్‌బౌల్డ్ అయిన దృశ్యం

సెమీఫైనల్లో ఎస్.కె.ఎస్.సి..


ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి కళాశాల జట్టు

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. కళాశాల జట్టు, కడప నిర్మల ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నిర్మల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. జట్టులోని నాగార్జున 14 పరుగులు చేశాడు. ఎస్.కె.ఎస్.సి. జట్టు బౌలర్ శివకేశవ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.కె.ఎస్.సి. జట్టు 4.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. జట్టులోని భానుప్రకాష్ 17 పరుగులు చేశాడు. దీంతో ఎస్.కె.ఎస్.సి. జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది.

రాచపూడి..


బద్వేలు రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టు

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ట్రిపుల్‌ఐటీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. జట్టులోని మదన్ 10 పరుగులు చేశాడు. రాచపూడి బౌలర్ సందీప్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాచపూడి జట్టు 7.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 66 పరుగులు చేసింది. జట్టులోని శ్రీకర్ 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో రాచపూడి జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది.

కేఎస్‌ఆర్‌ఎం..


కడప కేఎస్‌ఆర్‌ఎం జట్టు

కేఓఆర్‌ఎం మైదానంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కడప కేఎస్‌ఆర్‌ఎం, కడప శ్రీహరి డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కేఎస్‌ఆర్‌ఎంఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీహరి జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని అమానుల్లాఖాన్ 30 పరుగులు చేశాడు. కేఎస్‌ఆర్‌ఎం బౌలర్ బలరాం 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేఎస్‌ఆర్‌ఎం జట్టు 9 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. దీంతో కేఎస్‌ఆర్‌ఎం జట్టు 5 వికెట్లతో గెలుపొందిసెమీఫైనల్‌కు చేరింది.

ఎస్.వి. డిగ్రీ కళాశాల..


కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు

మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించిన క్వార్టర్ ఫైనల్‌లో కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. జట్టులోని ఏడుకొండలు 32 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్టు 5.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. దీంతో ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరింది.

విద్యార్థుల అదృశ్యంపై విచారణ


విద్యార్థులను విచారిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

బి.కొత్తకోట : బి.కొత్తకోట సమీపంలోని జీఎంసీ బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం నుంచి అదృశ్యమైన 30 మంది విద్యార్థులతో అధికారులు గురువారం రాత్రి సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఆర్డీఓ మురళీ, డీఎస్పీ కేశప్ప, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్, ఎంఈవో రెడ్డిశేఖర్, డీటీ హరికుమార్‌లు విచారించారు. ఒక్కో విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకొన్నారు. ఇందులో ప్రధానంగా ఓ లెక్చరర్ 8వ తరగతి విద్యార్థులను తమపై ఉసిగొల్పి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హాస్టల్‌లో ఖాళీ మద్యం బాటిళ్లు పెట్టి తామే మద్యం తాగుతున్నామని ఆరోపిస్తూ వేధిస్తున్నట్టు చెప్పారు. గతంలో తాము సిగరెట్లు కాల్చేవారమని, ఇప్పుడు కాల్చడం లేదని కొందరు విద్యార్థులు అంగీకరించారు. వేధింపులు భరించలేకనే ప్రహరీగోడ దూకి బయటకు వెళ్లిపోయామని చెప్పారు. అందరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి తిరుపతికి వెళ్లిపోదామనుకుని ఆగిపోయామని చెప్పారు. బుధవారం విద్యాలయాల జిల్లా సమన్వయ అధికారి వెంకటరావు గురుకులంలో తనిఖీలు చేశారని, ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారని విద్యార్థులు అధికారులకు వివరించారు. తర్వాత అధికారులు ఎంతమంది మొదటి సంవత్సరం ఉత్తీర్ణులయ్యారని ప్రశ్నించగా అందరూ మంచి మార్కులతో పాసైనట్టు వివరించారు. చదువులో ముందున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ వివరాలను పరిశీలించిన ఆర్డీఓ మురళీ సమస్యలను తెలిపేందుకు ఒక ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేస్తామని, అందులో ఇబ్బందులను తెలియజేయాలని కోరారు. అనంతరం అధికారులు హాస్టల్, డార్మెంటరీలను పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అందరూ భోజనం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం సత్వరమే స్పందించింది. గురుకుల విద్యాలయాల కార్యదర్శి పవనమూర్తి, సమన్వయ అధికారి వెంకటరావులు ఫోన్‌లో విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ఆచూకీ కోసం పలు సూచనలు ఇచ్చారు.

మహిళ హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు

మదనపల్లె : మహిళ హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు శిక్ష విధిస్తూ ఏడీజే భాస్కరరావు గురువారం తీర్పు ఇచ్చారు. చిత్తూరుజిల్లా పుంగనూరు సీఐ గంగిరెడ్డి కథనం మేరకు .. పుంగనూరు మండలం నెక్కుంది పంచాయతీ మొరుంపల్లెకు చెందిన కలగటూరి నారాయణ(62) డిసెంబర్ 6, 2015న అదే గ్రామానికి చెందిన పార్వతమ్మను తలపై సుత్తితో కొట్టి హత్య చేశాడు. ఇద్దరూ వివాహేతర సంబంధం కొనసాగించారు. ఈక్రమంలో పార్వతమ్మ ఆస్తి అమ్మి నగదు స్వాహా చేశారు. ఆ డబ్బులు ఇవ్వాలని పార్వతమ్మ పట్టుపట్టడంతో జరిగిన ఘర్షణలో ఆమెను హత్యచేశాడు. ఈ ఘటనపై అప్పటి సీఐ చంద్రశేఖర్ నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరారోపణ రుజువుకావడంతో నిందితుడికి జీవితఖైదుతో పాటుగా రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకుంటే మరో మూడునెలలు అదనపు జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. అనంతరం పుంగనూరు పోలీసులు నిందితుడిని స్థానిక సబ్‌జైలుకు తరలించారు. నిందితుడికి శిక్ష పడేలా ఏపీపీ జనార్ధనరెడ్డి కేసు వాదించారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట


సర్వేనెంబర్ 421లో బోర్డు ఏర్పాటు చేయించిన తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయిల విలువ చేసే స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు అడ్డుకట్ట వేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మన్నూరు గొల్లపల్లె వద్ద సర్వే నంబర్ 421లో ఉన్న 98 సెంట్ల స్థలాన్ని ఆ ప్రాంతానికి చెందిన వారు ఆక్రమించుకున్నారు. అధికారులు ఆక్రమణకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయడంతో ఆక్రమణదారులు పై సర్వే నంబర్‌లోని స్థలం తమకు చెందినదని కోర్టును ఆశ్రయించారు. దీంతో మున్సిపల్ చైర్మన్ న్యాయవాదిని నియమించి ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని స్టే తీసుకొచ్చారు. అనంతరం సబ్‌కలెక్టర్ అహమ్మద్‌ఖాన్‌ను కలిసి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో సబ్‌కలెక్టర్ స్థలానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డిని ఆదేశించారు. దీంతో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి గురువారం పై సర్వే నెంబర్‌లోని స్థలం ప్రభుత్వ భూమి అని, ఇందులోకి ఎవరైనా ప్రవేశిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ మన్నూరు గొల్లపల్లె వద్ద 421 సర్వే నంబర్‌లోని 98 సెంట్ల స్థలం ప్రభుత్వానికి చెందినదని తెలిపారు. ఈ స్థలంలో ఎవరికి ఎలాంటి హక్కులేదని తెలిపారు.. స్థల ఆక్రమణ విషయమై సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకుపోయిన వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నందుకు మున్సిపాలిటీ ప్రజల తరపున చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి సబ్‌కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న కారు పట్టివేత

ఇద్దరు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్

బి.కొత్తకోట : కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నిందితులను అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకున్నామని మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్‌లు గురువారం తెలిపారు. వారి కథనం మేరకు..తంబళ్లపల్లె మండలం బురుజుపల్లెకు చెందిన నరేంద్ర అలియాస్ నరేంద్ర నాయుడు (24), అతని స్నేహితుడు మంజునాథ్ (25)లు కొంతకాలంగా కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో నివాసం ఉంటున్న వీరు మద్యం తరలించి విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున అద్దె కారులో కర్ణాటకలోని లక్ష్మీపురం క్రాస్ నుంచి కర్ణాటక మద్యం తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. కారు మొటుకుపల్లె పంచాయతీ నుంచి టేకులపెంట మీదుగా తంబళ్లపల్లెకు వెళుతుండగా పట్టుకునేందుకు నాయనబావి వద్ద పోలీసులు నిఘా వేసి దాడి చేశారు. దాడిలో కర్ణాటక మద్యం పట్టుబడింది. కారులోని ఎనిమిది బాక్సుల మద్యం (384 ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.40వేలు కాగా కారు విలువ రూ.4లక్షలని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లె : తల్లిదండ్రులు మందలించడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ కొండసానివారిపల్లెకు చెందిన శ్రీరాములు కుమారుడు బి.బాలాజీ(20) పనులు సక్రమంగా చేయడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా నిమ్మనపల్లెకు చెందిన రామచంద్ర కుమారుడు మహేష్‌బాబు(32) రోజువారీ పనులకు వెళ్లకుండా నిర్లక్ష్యం చూపడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మహేష్‌బాబు గురువారం షుగర్ మాత్రలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో: ఒకరి మృతి


నాగార్జున (ఫైల్)


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టెంపో వాహనం

పీలేరురూరల్ : ఆగి ఉన్న లారీని టెంపో ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లెకు చెందిన డ్రైవర్ కె. నాగార్జున (35), తమిళనాడు కాంచిపురానికి చెందిన క్లీనర్ దినేష్‌లు అశోక్ లైల్యాండ్ టెంపో వాహనంలో కలకడ నుంచి తమిళనాడుకు టమాట తరలించేవారు. ఈ క్రమంలో టమాట లోడ్ కోసం తమిళనాడు నుంచి ఖాళీ ట్రేలతో బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున స్థానిక రిలయన్స్ పెట్రోల్‌బంకు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న విద్యుత్ స్తంభాల లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. దినేష్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య గంగాదేవి, కుమారుడు జగన్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమాచార కేంద్ర భవనం పనులు ప్రారంభం

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పోలీసు సమాచార కేంద్రం భవనం పనులకు గురువారం మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామమోహన్‌లు భూమి పూజ చేశారు. గాలిబండ వద్ద దీని నిర్మాణం చేపట్టారు. కొండకు వచ్చే సందర్శకులకు ఈ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది ఎక్కడెక్కడికి ఎలా వెళ్లాలి..చూడదగిన ప్రాంతాలపై సమాచారం ఇస్తారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటారు.

కుటుంబకలహాలతో వ్యక్తి ఆత్మహత్య


శంకరరెడ్డి మృతదేహం

మదనపల్లె : పట్టణంలోని చంద్రాకాలనీలో కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. స్థానికుడైన రెడ్డెప్పరెడ్డి కుమారుడు సి.శంకర్‌రెడ్డి(40)కు 2008లో చింతామణికి చెందిన లక్ష్మీదేవితో వివాహం జరిగింది. భార్య కోరిక మేరకు శంకరరెడ్డి చింతామణిలో హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తూ అత్తవారింటిలో స్థిరపడ్డాడు. వీరికి కుమారుడు చరణ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె జయశ్రీ ఉన్నారు. ఇటీవల కుమారుడికి దివ్యాంగ పింఛన్ మంజూరైంది. తండ్రి రెడ్డెప్పరెడ్డి అనారోగ్యం బారిన పడటంతో చూసి వెళ్లేందుకు వారంరోజుల క్రితం మదనపల్లెకు వచ్చాడు. గురువారం తెల్లవారుజామున తండ్రి రెడ్డెప్పరెడ్డికి చికిత్సలో భాగంగా తల్లిని తీసుకుని తమ్ముడు మనోహర్‌రెడ్డి బైరెడ్డిపల్లె మండలం విరూపాక్షపురానికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకరరెడ్డి ఇటీవల భార్య లక్ష్మీదేవితో ఏర్పడ్డ విభేదాల కారణంగా మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం విరూపాక్షపురం నుంచి ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబసభ్యులు శంకర్‌రెడ్డి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికికారు. ఇంటికి దగ్గరలోని చింతచెట్టుకు ఉరివేసుకుని ఉండటం గమనించారు. వెంటనే మృతదేహాన్ని కిందకు దించి శవపరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో వృద్ధురాలికి తీవ్రగాయాలు


ఘర్షణలో గాయపడ్డ వృద్ధురాలు వెంకటమ్మ

మదనపల్లె : ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ గూండాలపల్లెకు చెందిన గంగప్ప భార్య వెంకటమ్మ(70) మనవడి భార్య గౌతమిపై, ఆమె తండ్రి రామచంద్ర, అక్క భాగ్య, బావ రెడ్డెప్పలు దాడి చేస్తుండటంతో వృద్ధురాలు అడ్డుకునేందుకు వెళ్లింది. ఈక్రమంలో ఆమె చేతికర్రను లాక్కుని విసురుగా నెట్టివేయడంతో కిందపడి నడుము విరిగింది. గౌతమి గాయపడింది. పదినెలల క్రితం గౌతమి భర్త రామచంద్ర అనారోగ్య కారణాలతో మరణించడంతో ప్రభుత్వం ఆమె ఖాతాలో లక్ష రూపాయల నగదు జమచేసింది. నగదు విషయమై ప్రశ్నించేందుకు వచ్చిన గౌతమి కుటుంబసభ్యులు ఆమెతో ఘర్షణ పడగా, వృద్ధురాలు వెంకటమ్మ అడ్డుకునే ప్రయత్నంలో గాయపడింది. బాధితురాలను కుటుంబసభ్యులు ఆటోలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.